క్లుప్తంగా

సబ్సిడీపై యూరియా

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న యూరియాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చేర్యాల పీఏసీఎస్ చైర్మన్ మెరుగు కృష్ణ సూచించారు. మండల కేంద్రంలోని అయినాపూర్‌లో బుధవారం సబ్సిడీ యూరియాను రైతులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ దుకాణాలలో 45కిలోల బస్తాను రూ.300 నుంచి 320 వరకు విక్రయిస్తున్నారని పీఏసీఎస్ ఆధ్వర్యంలో రూ.280కే అందిస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎంపీటీసీ జయరాములు, శ్రీనివాస్, మహిపాల్‌రెడ్డి, అచ్యుత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేఖలతో భాషాపరిజ్ఞానం



ఉత్తరాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

చిన్నకోడూరు(సిద్దిపేట): సెల్ ఫోన్, ఇంటర్‌నెట్ వినియోగం కారణంగా లేఖా రచన తగ్గిందని, ఉత్తరాలు రాయడం వల్ల విద్యార్థుల్లో భాషాపరిజ్ఞానం పెరుగుతుందని ఉన్నత పాఠశాల హెచ్ఎం జ్యోతి అన్నారు. మండల పరిధిలోని అనంతసాగర్ ఉన్నత పాఠశాలలో పత్తిపాక ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉత్తరాలు రాసే కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులు తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషల్లో బంధువులు, స్నేహితులకు ఉత్తరాలు రాసి పోస్టు బాక్స్‌లో వేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారిగా సాయి కిరణ్



దుబ్బాకటౌన్: మండల నూతన వ్యవసాయాధికారిగా సాయి కిరణ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. నిర్మల్ జిల్లా నర్సాపూర్ వ్యవసాయాధికారిగా పనిచేసి సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన దౌల్తాబాద్‌కు వచ్చారు. ఇక్కడ పనిచేసిన గోవిందరాజు కుక్కునూర్‌పల్లి మండలానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా సాయి కిరణ్ మాట్లాడుతూ రైతులకు అందుబాటులో సమస్యలు పరిష్కరిస్తానన్నారు.

డీఐఈవో స్పందించడం లేదు


మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): డిలీట్ ఆప్షన్ లేకపోవడంతో ఇంటర్మీడియట్ విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నా డీఐఈవో స్పందించడం లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆముదాల రంజిత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ కేంద్రంలో బుధవారం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ అడ్మిషన్‌ల ప్రక్రియ మొదలై రెండు నెలలు గడుస్తున్నా ఇంత వరకు డిలీట్ ఆప్షన్ ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. వేరే కాలేజీలో చేరుదామంటే ప్రైవేట్ కాలేజీలు అడ్మిషన్‌ను డిలీట్ చేయడం లేదని మండిపడ్డారు. ఇంటర్మీయట్ బోర్డు స్పందించి వెంటనే ఆప్షన్ కల్పించాలని డిమాండ్ చేశారు. భరత్, శివ, రవి, రాజేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి మెమో

సాక్షి ఎఫెక్ట్..

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల పరిధిలోని రేగొండ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడికి ఎంఈఓ దేశిరెడ్డి మెమో జారీ చేశారు. గత 18న 'బంజరు దొడ్డిలా 'బడి'.. ఉపాధ్యాయుడిపై ఎంఈఓ ఆగ్రహం, ఆవరణంలో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం' అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఎంఈఓ స్పందించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ మూడు రోజుల్లో సరైన సమాధానం చెప్పాలని ఆ ఉపాధ్యాయుడిని కోరామన్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. విధులపై నిర్లక్ష్యంగా వహించే ఉపాధ్యాయులను సహించబోమని హెచ్చరించారు.

అనాథల సమాచారం ఇవ్వండి: లావణ్య

సిద్దిపేటజోన్: ప్రధాన రహదారులు, బస్టాండ్, ఇతర ప్రాంతాల్లో అనాథలను గుర్తిస్తే తమకు తెలియజేయాలని జిల్లా మహిళ సాధికారిత కేంద్రం ప్రతినిధి లావణ్య కోరారు. జిల్లా కేంద్రంలో భిక్షాటన చేస్తున్న ఓ వృద్ధ మహిళను ఆమె గుర్తించి బుధవారం లార్డ్ హోమ్ (పట్టణ నిరాశ్రయుల ఆశ్రమం)లో చేర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరైనా అనాథలను గుర్తిస్తే హెల్ప్‌లైన్ నంబర్లు 14567, 181, 100, 112లకు సమాచారం ఇవ్వాలని, వారిని సురక్షితంగా హోమ్‌లో చేర్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కొరవడిన సహకారం

- మత్స్యకారులకు శిఖం నిబంధన
- కొత్త సభ్యత్వాలకు నీటి విస్తీర్ణం మెలిక
- అందని సబ్సిడీలు, పథకాలు


కోనేటి వాగులో చేపలు పడుతున్న మత్స్యకారులు

మత్స్యకారులకు సహకార సంఘంలో సభ్యత్వాలు దొరకడం అందని ద్రాక్షగా మారింది. రెండు ఎకరాల చెరువు శిఖం ఉండాలనే నిబంధనే అందుకు గల కారణం. దీంతో అర్హతగల మత్స్యకారులు సభ్యత్వాలకు దూరమవుతున్నారు. ఆ నిబంధనను సవరించాలని, గౌరవెల్లి ప్రాజెక్టు విస్తీర్ణాన్ని పరిగణలోకి తీసుకొని సభ్యత్వాలు ఇవ్వాలని నిరసనలు వెల్లువెత్తుతున్నాయి.

– హుస్నాబాద్‌రూరల్

కులవృత్తులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి సబ్సిడీ రుణాలను అందిస్తోంది. అందులో భాగంగా మత్స్యకారుల కోసం ప్రతియేటా ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తోంది. అలాగే ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలను అందించి ఉపాధి పొందేందుకు చేయూత నిస్తోంది. తొలి విడతలో ఒక సొసైటీలో 100మంది సభ్యులు ఉంటే 30 మంది వరకే సబ్సిడీపై యంత్రాలను అందుకున్నారు.

సభ్యత్వం ఉంటేనే..

ప్రభుత్వ పథకాలను పొందాలంటే సహకార సంఘాల్లో సభ్యత్వం పొందాల్సి ఉంటుంది. జిల్లాలో 283 సహకార సంఘాల్లో 20,500 మంది సభ్యులు ఉండగా అధికారులు కొత్తగా మరో 12వేల సభ్యత్వాలను అందించారు. జిల్లాలో 3,443 చెరువు, కుంటల నీటి విస్తీర్ణానికి లోబడి మాత్రమే మత్స్యకార సహకార సంఘంలో సభ్యత్వం ఇస్తారు.

అడ్డుపడుతున్న నిబంధనలు

18ఏళ్ల నిండిన వారందరికీ సభ్యత్వం ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ చెరువుల నీటి విస్తీర్ణం నిబంధన తేవడంతో యువ మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక ఊరు చెరువు విస్తీర్ణం 100ఎకరాలు ఉంటే ఆ ఊరి సొసైటీలో 50మంది సభ్యత్వం పొందే అవకాశం ఉంటుంది. గ్రామాల్లో జనాభా ఎక్కువగా ఉండడం చెరువు శిఖం తక్కువగా ఉండడంతో సభ్యత్వాలను పొందలేకపోతున్నారు. గొల్లకురుమలు, చేనేత, గీత కార్మికులకు లేని నిబంధనలను మత్స్యకారులకు ఎందుకు పెట్టారని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఆ నిబంధనను తొలగించి ప్రతి మత్స్యకారుడికీ సభ్యత్వం ఇవ్వాలని కోరుతున్నారు.

సబ్సిడీపై వాహనాలను అందించాలి



గొల్లకురుమలకు ఇచ్చినట్టే సభ్యత్వం పొందిన మత్స్యకారులకు కూడా సబ్సిడీపై వాహనాలను అందించాలి. ప్రభుత్వం పంపిణీచేసే చేపల పెంపకంతో ఉపాధి పొంది వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలంటే వాహనాలు చాలా అవసరం. తొలివిడతలో ఒక్కొక్క సొసైటీలో 100మంది ఉంటే 30మందికే వచ్చాయి. మిగతా 70మంది వాహనాల కోసం ఎదురుస్తున్నారు. కొత్త ప్రభుత్వం మత్స్యకారులకు ఎక్కువ నిధులు కేటాయించాలి.

– పొన్నబోయిన శ్రీనివాస్, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు

భారత్ బంద్ ప్రశాంతం

సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తూ మాల, మాల ఉపకుల సంఘాల ఐక్యవేదిక నాయకులు ఇచ్చిన పిలుపుమేరకు జరిగిన భారత్ బంద్ అన్ని మండల కేంద్రాల్లోను బుధవారం ప్రశాంతంగా జరిగింది. నాయకులు ఆర్టీసీ డిపోల వద్ద నిరసన కార్యక్రమాలు, బైక్ ర్యాలీలు నిర్వహించారు. దుకాణాలు, పాఠశాలలు మూతపడ్డాయి. సుప్రీంకోర్టు ఇచ్చిన వర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు.


చేర్యాల(సిద్దిపేట): బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మాలమహానాడు సభ్యులు


సిద్దిపేటకమాన్: ఆర్టీసీడిపో ఎదుట నిరసన


సిద్దిపేటరూరల్: రోడ్డుపై బైఠాయించిన నాయకులు


దుబ్బాకటౌన్: నిర్మానుష్యంగా రోడ్లు

పల్లె దవాఖానాలో మెరుగైన వైద్యం

- మంత్రి పొన్నం ప్రభాకర్


మాట్లాడుతూన్న మంత్రి పొన్నం

కోహెడరూరల్(హుస్నాబాద్): పేదలకు పల్లె దవాఖానాలో మెరుగైన వైద్య సేవలు అందుతాయని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మండలంలోని బస్వాపూర్ గ్రామంలో బుధవారం ఆయన పల్లె దవాఖానను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిమ్ సెంటర్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ మనుచౌదరి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు రాజీనామా చేయాలి

- టీపీసీసీ కార్యదర్శి యాదగిరి


మాట్లాడుతున్న యాదగిరి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీచేస్తే ఎమ్మెల్యేగా రాజీనామా చేస్తానన్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు వెంటనే ఆ మాట నిలబెట్టుకోవాలని టీపీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ నాయకులు తమ ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారన్నారు. రుణమాఫీపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదని మండిపడ్డారు. మైనంపల్లి రోహిత్ చేతిలో ఓటమి పాలైన పద్మాదేవేందర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని విమర్శించడం ఆశ్చర్యకరంగా ఉందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో నాగరాజు, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు అవగాహన


మాట్లాడుతున్న జడ్జి స్వాతిరెడ్డి

సిద్దిపేటజోన్: వరల్డ్ సీనియర్ సిటిజెన్స్ డే సందర్భంగా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక టీఎన్జీవో భవన్‌లో సీనియర్ సిటిజెన్స్‌కు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ ఎస్.స్వాతిరెడ్డి మాట్లాడుతూ వృద్ధుల సమస్యల పరిష్కారానికి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీని సంప్రదించాలన్నారు. ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో అంజయ్య, విక్రమ్‌రెడ్డి, బాలేశం, చంద్రారెడ్డి, శ్రీకర్‌రెడ్డి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చేర్యాల(సిద్దిపేట): మండల కేంద్రంలోని పాఠశాలలు, పెద్దమ్మగడ్డలోని తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హెచ్ఎం నాగమణి బుధవారం తెలిపారు. 95505 58875 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

విద్యుత్‌కు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11కేవీ మార్కెట్ యార్డు ఫీడర్‌ల మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పటేల్‌పుర, అంబేడ్కర్‌నగర్, సంజీవయ్యనగర్, శంకర్‌నగర్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, బోయగల్లి, సాజీద్‌పుర, వీవీనగర్ ప్రాంతాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

హరీశ్‌పై విమర్శలు అర్థరహితం


సిద్దిపేటజోన్: మాట్లాడుతున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు

సిద్దిపేటజోన్: మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావును విమర్శించే నైతికత మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు లేదని సిద్దిపేట బీఆర్ఎస్ మున్సిపల్ కౌన్సిలర్లు ప్రవీణ్, మల్లికార్జున్, నాగరాజురెడ్డి మండిపడ్డారు. బుధవారం వారు మాట్లాడుతూ జిల్లాకు మంజూరైన వెటర్నరీ కళాశాలను కొడంగల్‌కు తరలిస్తే అడగని మైనంపల్లి ఇప్పుడు సిద్దిపేటకు ఏదో చేస్తాను అనడం విడ్డూరంగా ఉందన్నారు. తన కొడుక్కి మంత్రిపదవి కోసం తాపత్రయం పడుతున్నారని ఆరోపించారు. దాడిచేసిన కాంగ్రెస్ నాయకులకు వత్తాసు పలకడం సరికాదన్నారు. సమావేశంలో శోభ, అనూష, విజయ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ఉనికి కోసమే..

మిరుదొడ్డి(దుబ్బాక): రాజకీయ ఉనికి కోసమే మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆరాటపడుతున్నారని సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ హరీశ్‌రావుపై మైనంపల్లి చేస్తున్న విషప్రచారాన్ని ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే తగిన గుణపాఠం చెప్తారన్నారు.

ఎస్ఎఫ్ఐ తప్పుడు ఆరోపణలు తగవు

- యూఎస్ఎఫ్ఐ నేతలు


గజ్వేల్‌రూరల్: మాట్లాడుతున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: ఎస్ఎఫ్ఐ నాయకులు యూఎస్ఎఫ్ఐపై తప్పుడు ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నామని, అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆధారాలుంటే బహిరంగ చర్చకు రావాలని గజ్వేల్ డివిజన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం గజ్వేల్‌లో మాట్లాడుతూ వ్యక్తిగత అవసరాల కోసం సంఘాలు పెట్టాల్సిన అవసరం తమకు లేదన్నారు. యూఎస్ఎఫ్ఐ(భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్) 1984లో ఆవిర్భవించిందని, అప్పటి నుంచి విద్యార్థుల సమస్యలపై అనేక ఉద్యమాలు చేస్తోందని చెప్పారు. తమ ఉనికిని కోల్పోతున్నామనే భయంతోనే తమపై ఎస్ఎఫ్ఐ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ప్రవీణ్, యాదగిరి, శ్రవణ్, సందీప్, వినయ్, స్వామి, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కమిటీ సమావేశాలు

సిద్దిపేటకమాన్: 27న జరగనున్న భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని నాయకులు కోరారు.

ఇద్దరికి గాయాలు

మద్దూరు(హుస్నాబాద్): రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల వివరాల ప్రకారం.. మండలంలోని కోనాయిపల్లికి చెందిన రాజు తన కుటుంబంతో కలిసి చేర్యాలవైపు వెళ్తుండగా జెల్లగూడెం నుంచి వస్తున్న కుమ్మం రాహుల్ తన వాహనంతో ఢీకొన్నాడు. దీంతో వారిద్దరికీ గాయాలయ్యాయి. పోలీసులు అక్కడికి చేరుకొని వారిని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోటవేటర్ ప్రమాదంలో..

నంగునూరు(సిద్దిపేట): ప్రమాదవశాత్తు రోటవేటర్‌లో ఇరుక్కొని యువకుడి కాలు తెగిపడిన ఘటన బుధవారం గట్లమల్యాల మధిర గ్రామం సీతారాంపల్లిలో చోటు చేసుకుంది. లవుడ్యా శ్రీకాంత్ ఇటీవలే తన రోటవేటర్ ట్రాక్టర్‌ను మరమ్మతు చేయించి పక్కన పెట్టాడు. అది ఎలా పనిచేస్తుందో తెలుసుకునేందుకు పరిశీలిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు శ్రీకాంత్ కాలు తెగిపడింది. సిద్దిపేట ఆసుపత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని ఓప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ శ్యామలత బుధవారం తెలిపారు. సీఈసీ, ఈసీలో సీట్లు ఖాళీ ఉన్నాయని, ఆసక్తి గల విద్యార్థులు శుక్రవారం ఉదయం 10గంటలకు పోతారం (ఎస్)లోని గురుకులంలో హాజరు కావాలని సూచించారు.

సాంకేతికతను అందిపుచ్చుకోండి

సిద్దిపేటఅర్బన్: నూతన సాంకేతికతను అందిపుచ్చుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ వినయ్‌బాబు, జెడ్ఎఫ్ టెక్నాలజీ సెంటర్ ఇండియా మేనేజర్, గ్లోబల్ టాలెంట్ అడ్వైజర్ సతీశ్‌కుమార్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల శివారులోని ఇందూరు ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియెంటేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవలం సర్టిఫికెట్ కోసం కాకుండా ఏదో ఒక సబ్జెక్టులో ప్రతిభ కనబరచాలన్నారు. చైర్మన్ ప్రదీప్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వీపీ రాజు, ప్రవీణ్‌కుమార్, పాండురంగం, అస్మా జబీన్, కల్పన తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం వండిన హెచ్ఎం


వంటచేస్తున్న హెచ్ఎం ఫాతిమారాణి

మద్దూరు(హుస్నాబాద్): మధ్యాహ్న భోజన నిర్వహకురాలు తనకు గిట్టుబాటు కావడం లేదని వంట మానేయడంతో గత్యంతరం లేక హెచ్ఎం ఫాతిమా రాణి స్వయంగా విద్యార్థులకు భోజనం వండిపెట్టారు. మండలంలోని వల్లంపట్ల గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 48 మంది విద్యార్థులు చదువుతున్నారు. మధ్యాహ్నం భోజన నిర్వహకురాలు కవిత తనకు గిట్టుబాటు కావడం లేదని కారణంతో మధ్యాహ్నం భోజనం వండడం లేదు. దీంతో స్కావెంజర్ అనితతో ఉపాధ్యాయులు గత 12న మధ్యాహ్న భోజనం వండించారు. అయితే ఆమెతో వండించడం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ లావణ్య నిరాకరించారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు, పలువురు యువకులు బుధవారం పాఠశాల వద్ద ఉపాధ్యాయులు, నోడల్ అధికారి వరదరాజుతో గొడవ పడ్డారు. రేపటి నుంచి మధ్యాహ్న భోజన నిర్వాహకులను ఏర్పాటు చేస్తామని నోడల్ అధికారి హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు వెనుతిరుగారు.

ప్రశ్నార్థకంగా మారిన మహిళల భద్రత

గజ్వేల్‌రూరల్: కోల్‌కతాలోని ఓ మెడికల్ కళాశాలలో విధుల్లో ఉన్న పీజీ వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచార ఘటనతో మహిళల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని టీపీటీఎఫ్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనను ఖండిస్తూ బుధవారం రాత్రి అంబేడ్కర్ చౌరస్తా వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన, నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఘటనకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నరేందర్, రామచంద్రం, రాజులు, విద్యాసాగర్, పాపిరెడ్డి, శంకర్, నర్సయ్య, రాజయ్య, నాగరాజు, రాములు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ గృహజ్యోతి దరఖాస్తుల స్వీకరణ

గజ్వేల్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 200 యూనిట్లలోపు వినియోగించే ప్రజలు దరఖాస్తు చేసుకునేందుకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

◆ మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించిందని ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో నిర్వహించిన వాహన తనిఖీల్లో ఎనిమిది మంది పట్టుబడ్డారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.11,200 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

◆ పరస్పర బదిలీలకు..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో కాంట్రాక్ట్ పద్ధతుల్లో విధులు నిర్వహిస్తున్న స్పెషల్ అధికారులు, ఇతర ఉపాధ్యాయులు, సిబ్బంది రెండేళ్ల సర్వీస్ పూర్తిచేసిన వారికి పరస్పర బదిలీలకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను 24లోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

◆ రైతులు ఆందోళన చెందొద్దు

జగదేవ్‌పూర్(గజ్వేల్): రుణమాఫీ కానీ రైతులు ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయ అధికారి వసంతరావు సూచించారు. రైతువేదికలో బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసి రుణమాఫీ కాని రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నామన్నారు.

◆ పేకాటరాయుళ్ల అరెస్టు

సిద్దిపేటరూరల్: మండల పరిధిలోని చిన్నగుండవెళ్లి శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేయామని ఎస్ఐ అపూర్వరెడ్డి తెలిపారు. వచ్చిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేశారని, ఐదుగురిని అదుపులోకి తీసుకోగా ఒకరు పరారయ్యారని చెప్పారు. వారి నుంచి రూ.2680 నగదు, 5 మొబైల్ ఫోన్లు, 6 బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

◆ సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ..

సిద్దిపేటజోన్: హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని గుట్లమిట్ట గ్రామానికి చెందిన బాలయ్యకు మంజూరైన రూ.60.వేల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు రజనీకాంత్, సాయి ప్రేమ్, బాబు, వెంకట్ పాల్గొన్నారు.

◆ రైతుకు గాయాలు

దుబ్బాకరూరల్: విద్యుత్ స్తంభంపై నుంచి పడి రైతుకు గాయాలైన ఘటన మండలంలోని హబ్షీపూర్ శివారులో జరిగింది. మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామానికి చెందిన రైతు లక్ష్మయ్య స్తంభంపై విద్యుత్ వైరు సరిచేస్తుండగా కాలుజారి కింద పడ్డాడు. తీవ్రంగా గాయాలు కావడంతో సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

◆ పూర్వ విద్యార్థి సాయం

దుబ్బాకటౌన్: తాను చదివిన పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ఓ పూర్వ విద్యార్థి ఆర్థిక సాయం చేశాడు. కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన చిందం రమేశ్ 1994–95లో దౌల్తాబాద్ మండల కేంద్రంలో మహాత్మా జ్యోతిరావు పూలే సంక్షేమ పాఠశాలలో చదువుకున్నాడు. ఆయన బుధవారం రూ.75 వేల చెక్కును ప్రిన్సిపాల్ స్వప్నకు అందజేశారు.

◆ ఏఓగా పరశురామ్‌రెడ్డి

సిద్దిపేటరూరల్: నారాయణరావుపేట మండల నూతన వ్యవసాయాధికారిగా పరశురామ్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఏడీఏ పద్మ ఆయనను బుధవారం సన్మానించారు.

◆ సమస్యల పరిష్కారానికి కృషి

ములుగు(గజ్వేల్): ఎస్జీటీ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ కృషి చేస్తుందని సిద్దిపేట జిల్లాశాఖ అధ్యక్షుడు ఆదారాసుపల్లి శశిధర్‌శర్మ చెప్పారు. బుధవారం ఆయా గ్రామాల పాఠశాలల్లో నిర్వహించిన ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. శ్రీనివాస్‌రెడ్డి, రంగారావు, అమర్‌నాథ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

◆ సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

కొండపాక(గజ్వేల్): సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం లాంటిదని మాజీ ఎంపీపీ ర్యాగల్ల సుగుణ పేర్కొన్నారు. కొండపాక మండలంలోని బందారం, దర్గా, అంకిరెడ్డిపల్లి, మర్పడ్గ, కోనాయిపల్లి గ్రామాలకు చెందిన 23మందికి మంజూరైన రూ.4.20 లక్షల చెక్కులను బుధవారం అందజేశారు. దుర్గయ్య, శ్రీనివాస్, ఐలయ్య పాల్గొన్నారు.

◆ ఎస్ఈగా చంద్రమోహన్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈగా టీఆర్ చంద్రమోహన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్ఈగా బాధ్యతలు చేపట్టిన మోహన్‌రెడ్డి స్థానంలో ఆయన విధుల్లో చేరారు.